రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త



# పంద్రాగస్టుకు సర్వం సిద్ధం

**వికారాబాద్,ప్రభాతవార్త :** స్వాతంత్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలనీ జిల్లా కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. జిల్లా స్థాయిలో నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహించేందుకు చేపట్టిన ఏర్పాట్ల ను జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా ఎస్పి స్నేహ మెహ్రాలు కలెక్టర్ కార్యాలయ ఆవరణను పరిశీలించారు. వేడుకలు నిర్వహించనున్న ప్రాంగణాన్ని సందర్శించిన కలెక్టర్, ఎస్పి ఏర్పాట్ల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. వేదిక, సీటింగ్, డెకరేషన్,పరేడ్, బందోబస్తు, పార్కింగ్, తాగునీరు, పారిశుద్ధం, విద్యుత్, ప్రజలకు అవసరమైన సౌకర్యాలపై అధికారులకు పలు సూచనలు చేశారు.స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. వేడుకలకు హాజరయ్యే ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు, కార్యక్రమం విజయవంతంగా జరిగేలా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సంవత్సరం తొలి సారిగా 1. వందే మాతరం 2.జనగణ మన 3 జయ జయహే తెలంగాణా, మూడు గీతాలాపనలు ఉంటాయని కలెక్టర్ తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు పాల్గొని తమ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన ఏర్పాట్లను కలెక్టర్‌కు వివరించారు.






### సమస్యల పరిష్కారానికి ముందడుగు

**కేశంపేట, ఆగస్టు 14, ప్రభాతవార్త :** కేశంపేట మండల పరిధిలోని ప్రజలకు సమస్యలను పరిష్కరించేందుకు ఇకపై కేశంపేట మండల కేంద్రం లోనే ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో రవిచంద్ర కుమార్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమం 17సోమవారం నుండి ప్రతి సోమవారం ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు కేశంపేట మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించబడుతుందన్నారు. ఈ అవకాశాన్ని కేశంపేట మండల పరిధిలోని ప్రజలుతమకు సంబంధించిన ప్రజా సమస్యలు, ఫిర్యాదులు మరియు వినతిపత్రాలను ప్రజావాణి కార్యక్రమంలో సమీర్పించ వచ్చని అన్నారు.






# పెద్దేముల్ సొసైటీకి తాళం!



యూరియా కష్టాలతో రైతుల కన్నెర్ర
సిబ్బందిని నిర్బంధించి ఆందోళన బాట
యాప్ పనిచేయటంలేదని ఆవేదన




**పెద్దేముల్, ఆగస్టు 14, ప్రభాతవార్త:** యూరియ కోసం రైతులు పడుతున్న కష్టాలకు అంతులేకుండా పోతోంది. యూరియ పంపిణిని సులభతరం చేస్తామంటు ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త బుకింగ్ యాప్ రైతులకు ఉపశమనం కల్పించాల్సి ది పోయి మరిన్ని ఇబ్బందులకు కారణమవుతోందని రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. యాప్‌లో బుకింగ్ చేసేందుకు గంటల తరబడి ప్రయత్నించిన సాంకేతిక సమస్యల కారణంగా యూరియ దక్కడంలేదని వాపోతున్నారు. శుక్రవారం పెద్దేముల్ సొసైటికి 500 సంచుల యూరియ వచ్చింది. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన బుకింగ్ ప్రక్రియ ప్రారంభించినా ఫలితం లేదకపోవడంతో రైతులు తీవ్ర అసహనానికి గురయ్యారు. మూకుమ్మడిగా పెద్దేముల్ ఎఫ్ఎస్‌సిఎస్‌కు చేరుకున్నారు. సిబ్బందిని కొంతసేపు నిర్బందించి ఆందోళన చేపట్టారు. అనంతరం రొడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. యాప్ వద్దు ఆధార్‌కార్డు ఆధారంగా నేరుగా యూరియ ఇవ్వాలంటు నినాదాలు చేశారు. యూరియ సకాలంలో అందకపోతే పంటలపై తీవ్ర ప్రబావం పడుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. తమకు సాంకేతిక పరిజ్ఞానం లేకపోవడం అవస్థలు పడుతున్నామని ఆందోళన వ్యక్తంచేశారు. రైతుల జీవితాలతో ఆడుకున్న ప్రభుత్వాలు ఎక్కువ కాలం ఉండలేవని హెచ్చరించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి యాప్‌లోని సాంకేతిక సమస్యలను పరిష్కరించడంతో పాటు యాప్‌తో సంబంధం లేకుండా యూరియ పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని రైతన్నలను శాంతింపజేశారు.

### పాముకాటుతో చిన్నారి మృతి

**కొత్తూరు, ఆగస్టు14, ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా కొత్తూరు గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. నల్లగొండ జిల్లా గట్టుప్పల్ మండలం తేటిపల్లి గ్రామానికి చెందిన రవి(30) జీవనోపాధి నిమిత్తం కుటుంబంతో కలిసి కొత్తూరుకు వచ్చి నివాసం ఉంటూ స్థలం లీజుకు తీసుకుని బ్రిక్స్ తయారీ కేంద్రం నిర్వహిస్తున్నాడు. గురువారం రాత్రి భోజనం అనంతరం రవి, అతని భార్య అనిత, పెద్ద కుమార్తె జెస్సి, చిన్న కుమార్తె హరిణి (4) కలిసి నిద్రించారు. శుక్రవారం అర్ధరాత్రి చిన్నారి హరిణి కుడి తొడపై ఏదో కరిచినట్లు బాధతో ఏడవడంతో కుటుంబ సభ్యులు నిద్రలేచి పరిశీలించారు. ఇంట్లో కట్లపాము కనిపించడంతో, చిన్నారి కుడి తొడపై పాము కాటు గుర్తులు ఉన్నట్లు గుర్తించారు.వెంటనే చిన్నారిని చికిత్స నిమిత్తం షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వైద్యులు ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షి ంచి చిన్నారి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.ప్రాథమిక సమాచారం మేరకు పాముకాటు కారణంగానే చిన్నారి హరిణి మృతి చెందినట్లు తెలుస్తోంది. ఈ మరణంపై కుటుంబ సభ్యులకు ఎలాంటి అనుమానం లేదని తండ్రి వరికుప్పల రవి తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

### ఉత్సాహంగా తిరంగా ర్యాలీ

**ఘట్‌కేసర్, ఆగష్టు 14, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌లో శుక్రవారం ఎన్‌సిసి క్యాడెట్లు ఉత్సాహంగా తిరంగా ర్యాలీ జరిపారు. హర్ ఘర్ తిరంగా స్ఫూర్తితో విద్యాకిరణ్ హైస్కూల్ ఎన్‌సిసి క్యాడెట్ల నినాదాలు చేస్తూ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు శివారెడ్డిగూడ విద్యాకిరణ్ హైస్కూల్ 2(టి) బ్యాటలియన్ ఎన్‌సిసి క్యాడెట్లతో సైకిల్ ర్యాలీ నిర్వహించారు.

### కోట్ పల్లి ప్రాజెక్టులో తిరంగా బోట్ ర్యాలీ..

**ధారూర్,ఆగస్టు 14, ప్రభాతవార్త:** ధారూర్ మండల పరిధిలోని కోట్ పల్లి ప్రాజెక్టులో దేశభక్తి భావాన్ని చాటుతూ నిర్వహించిన తిరంగా బోట్ ర్యాలీ అట్టహాసంగా ముగిసింది. దేశ ఐక్యతను పెంపొందించేలా చేపట్టిన ఈ కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండ విశ్వేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఎంపీ కొండ జాతీయ జెండాలతో అలంకరించిన బోట్లను తిలకించి, త్రివర్ణ పతాకాలను చేతబూని బోటింగ్ సిబ్బందితో కలిసి ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు. బోటింగ్ కోఆర్డినేటర్ రాములు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సిబ్బంది దేశభక్తిని, జాతీయ సమైక్యతను, జాతీయ జెండా యొక్క గొప్పతనాన్ని ప్రజలకు చాటిచెప్పారు. దేశం కోసం - దేశ ఐక్యత కోసం అనే నినాదంతో సాగిన ఈ తిరంగా బోట్ ర్యాలీ, ప్రాజెక్టు ప్రకృతి అందాల నడుమ నిర్వహించడంతో పర్యాటకులను, సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో బోటింగ్ కోఆర్డినేటర్ రాములుతో పాటు పలువురు బోటింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

### పోటీతత్వాన్ని సృజనాత్మకతతో ఎదుర్కోనాలి

**ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 14, ప్రభాతవార్త:** మారుతున్న కాలానికి అనుగుణంగా ఇంజినీరింగ్ విద్యార్థులు ఎప్పటికప్పుడు కొత్త ఆలోచనలతో ప్రపంచంలో నెలకొన్న పోటీతత్వాన్ని ఎదుర్కోవాలని జెఎన్‌టీయూహెచ్ వైస్ ఛాన్సలర్ టి. కిషన్ కుమార్ రెడ్డి అన్నారు. పోచారం డివిజన్ పరిధిలోని యంనంపేట్ శ్రీనిధి ఇంజినీరింగ్ కళాశాలలో 26 వ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జెఎన్‌టీయూహెచ్ వైస్ ఛాన్సలర్ పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించడమేగాక విలువలు పెంపొందించే విధంగా ఉండాలని అన్నారు. సమాజ ప్రగతికి ఇంజినీరింగ్ విద్యార్థుల పాత్ర కీలకమని అన్నారు. కొత్త సమస్యలు వస్తున్నకొద్దీ వాటి పరిష్కారానికి విద్యార్థులు కృషి చేయాలని అన్నారు. నూతన టెక్నాలజీని అందిపుచ్చుకుని సమస్యల పరిష్కరానికి కృషి చేయాలని అన్నారు. కళాశాల చైర్మన్ కేటీ. మహీ మాట్లాడుతూ ఇంజినీరింగ్ పూర్తిచేసుకుని పట్టభద్రులైన విద్యార్థులు తమ లక్ష్యసాధనకు మరింత కృషి చేయాలని కోరారు. తాము నేర్చుకున్న నైపుణ్యం, జ్ఞానాన్ని సమాజప్రగతికి అందించాలని అన్నారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు పట్టసర్టిఫికేట్లు పంపిణీ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్. శివారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగాతో పాటు శ్రీనిధి ఎడ్యుకేషన్ గ్రూపు చైర్మన్ కె.టీ. మహీ, సీఈవో పాల్గొన్నారు.










## రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తాం

**శామీర్‌పేట, (మేడ్చల్ జిల్లా ప్రతినిధి), ఆగస్టు 14, ప్రభాతవార్త:** బొమ్మరాసిపేట్ గ్రామ బాధిత రైతులకు అండగా ఉంటామని, న్యాయం జరిగే వరకు పోరాటాలు చేస్తామని బిఆర్ఎస్, బిజెపి పార్టీల నేతలు వేరువేరుగా ధర్నాలో పాల్గొని మద్దతు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులపైదాడులు,దౌర్జన్యాలు పెరిగినట్లు బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ మంత్రి,మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి, మల్కాజ్‌గిరి పార్లమెంట్ బిఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డిలు ఆరోపించారు. నోటీసుల పేరుతో రైతులను అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని, బొమ్మరాసిపేట్ భూముల విషయం పై సమగ్ర విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేశారు. బ్రోకర్ల డబ్బులతో ఆశపడి లంచాలకు పాల్పడే అధికారులకు శిక్షలు తప్పవని, చట్టాన్ని దిక్కరించేవారు తప్పించుకోలేరని, కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతుల భూములపై కన్నేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని, సహించేది లేదని మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ స్పష్టం చేశారు.

### రాజీవ్‌రహదారిన రాస్తారోకో చేసిన రైతులు

**శామీర్‌పేట, ఆగస్టు 14, ప్రభాత వార్త:** శామీర్‌పేట రాజీవ్‌రహదారిన బొమ్మరాసిపేట్ గ్రామ రైతులు తమకు న్యాయం చేయాలంటూ కొంత సేపు రాస్తారోకో చేసి నిరసన వ్యక్తం చేయగా ఈ రాస్తారోకోతో మాజీ సిఎం కెసిఆర్ కాన్వాయ్ కొంత సేపు ఇరుక్కు పోయింది. ఆ వెంటనే పోలీసులు స్పందించి రాస్తారోకో చేస్తున్న రైతులను అడ్డుకుని తొలగించి రోడ్డు క్లియర్ చేయటంతో ఆ వెంటనే మాజీ సిఎం కెసిఆర్ బాధిత రైతులకు అభివాదం చేస్తూ కాన్వాయ్‌లో బయలు దేరారు. ఫామ్‌హౌజ్ నుంచి నగరానికి వెళ్తుండగా శామీర్‌పేట మండల కార్యాలయం వద్ద గల రాజీవ్‌రహదారిన రైతులు రాస్తారోకో చేస్తుండగా ఆ సమయంలో కెసిఆర్ కాన్వాయ్ రావటం అందరిని ఆశ్చర్యాన్ని కల్గించింది. ఆ సమయంలో కెసిఆర్ వస్తారని ఎవరు కూడ ఊహించలేదు. అయితే మాజీ సిఎం కెసిఆర్ బామర్ది జోగినిపల్లి శ్రీనివాస్‌రావు మృతిచెందటంతో నగరంలో జరిగే అంత్యక్రియల కార్యక్రమంలో పాల్గొనటానికి కెసిఆర్ వెళ్లినట్లు తెలిసింది.



### ప్రభుత్వ భూముల రక్షణేలక్ష్యం

**జవహర్ నగర్, ఆగస్టు 14,ప్రభాత వార్త :** జవహర్ నగర్‌లో ప్రభుత్వ భూముల్లో వెలిసిన అక్రమ కట్టడాలను కాప్రా తహసిల్దార్ మతిన్ ఆదేశాలతో రెవిన్యుఅధికారులు కూల్చివేశారు. గిర్దావర్ సత్యనారయణ ఆధ్వర్యంలో వికలాంగుల కాలని, భీరప్పగడ్డ, అంబేద్కర్ నగర్, బీజేఆర్ నగర్‌లో జెసిబితో కట్టడాలను తొలగించారు. ప్రభుత్వ భుముల్లో అక్రమ నిర్మాణాలను ఎట్టి పరిస్థితులలోను సహించబోమని తహసిల్దార్ మతిన్ హెచ్చరించారు. పేదలకు ప్రభుత్వ భూములను అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులపై నిఘా పెట్టామని త్వరలో చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ భూముల రక్షణే తమ లక్ష్యం అన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గోన్నారు.










































## కలెక్టరేట్ వద్ద ఎస్ఎఫ్ఐ విద్యార్థుల ధర్నా

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 14, ప్రభాతవార్త:** మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ వద్ద ఎస్ఎఫ్ఐ విద్యార్థులు ధర్నా చేశారు. శుక్రవారం మేడ్చల్ కలెక్టరేట్ ముందు ధర్నా చేసి నిరసనలు తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న ఫీజురియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు రజనీకాంత్, రాష్ట్ర కార్యదర్శి నాగరాజులుమాట్లాడుతూ రాష్ట్రంలోవేలాది మంది విద్యార్థులు ఫీజురియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ అందక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.










## రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలి ..!

**తాండూరు, ఆగస్టు 14, ప్రభాతవార్త :** రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి తెలిపారు. తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం శుక్రవారం అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ముఖ్య అథితిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన మార్కెట్ కమిటీ చైర్మన్ వడ్డె శ్రీనివాస్, వైస్ చైర్మన్ ఖాసీ అలీతో పాటు పాలకవర్గ సభ్యులు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తూ.. రైతులకు మరింత మేలు జరిగేలా మార్కెట్ కమిటీని సమర్థవంతంగా నిర్వహించాలని, రైతులకు మంచి సేవలను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ్ల నీరజ, నూతన పాలకవర్గ సభ్యులు, నియోజకవర్గంలోని వివిధ మండలాల ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.







## మంత్రి అజారుద్దీన్‌ను కలిసిన కాంగ్రెస్ మైనార్టీ నేత అంజద్ గోరి జాఫర్

**షాద్‌నగర్, ఆగస్టు 14, ప్రభాతవార్త :**

రాష్ట్ర మైనార్టీ సంక్షేమ, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్‌ను షాద్‌నగర్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నేత అంజద్ గోరి జాఫర్ మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా జాఫర్ తనకు సంబంధించిన కిడ్నీ అనారోగ్య సమస్యను మంత్రి అజారుద్దీన్ దృష్టికి తీసుకెళ్లి, వైద్య చికిత్స కోసం ప్రభుత్వ సహకారం అందించాలని కోరారు. స్పందించిన మంత్రి అజారుద్దీన్, ప్రభుత్వం తరఫున అవసరమైన సహాయం అందేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.












## కబ్జా ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలి..!

**తాండూరు, ఆగస్టు 14, ప్రభాతవార్త :** తాండూరు పట్టణం నడిబొడ్డున ఉన్న ఏవాక్ఫ్యా ప్రాపర్టీని కబ్జా నుండి కాపాడాలని జనసత్తా జిల్లా అధ్యక్షులు ఠాకూర్ సూరజ్‌సింగ్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని వినాయక్‌చౌక్, పాత కూరగాయల మార్కెట్ రోడ్డులో ఉన్న ఏవాక్ఫ్యా స్థలాన్ని అక్రమించి అక్రమంగా దుకాణాలు నిర్మాణం చేపట్టి ఒక్కొక్కటి రూ.2కోట్ల చొప్పున విక్రయించాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వానికి చెందాల్సిన ఆస్తిని అక్రమంగా తప్పుడు పత్రాలను సృష్టించి కాజేస్తున్నారని, ఈ విషయంపై ఉన్నతా ధికారులకు ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. స్థానిక తహసీల్దార్‌కు కూడా ఫిర్యాదు చేసినా స్పందిం చడం లేదని అన్నారు. ఇది ముమ్మాటికి ప్రభుత్వ ఆస్తి అని.. ఈ విషయంపై స్థానిక తహసీల్దార్ మౌనం వీడాలని ప్రభుత్వ ఆస్తిని కాపాడే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ ఆస్తిని కాపాడేందుకు ఎంతకైనా సిద్ధమని. ఈ కుట్రలో ఉన్నవారిపై క్రిమినల్ చర్యలు తీసుకునేవరకు న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

## పోలీసులకు శారీరక, మానసిక ఫిట్‌నెస్ అవసరం

**-ఎస్పీ కార్యాలయంలో జిమ్ ప్రారంభించిన కలెక్టర్ దీపక్ తివారి**

**వికారాబాద్,ప్రభాతవార్త :** పోలీసులకు శారీరక, మానసిక ఫిట్నెస్ ఎంతో అవసరమని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. శుక్రవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో పునరుద్ధరించిన జిమ్‌ను జిల్లా కలెక్టర్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పోలీస్ విధులు ఎంతో బాధ్యతాయుతమైనవని, నిరంతరం విధుల్లో అప్రమత్తంగా ఉండేందుకు పోలీసు అధికారులు, సిబ్బంది శారీరకంగా దృఢంగా ఉండటంతో పాటు మానసికంగా ఆరోగ్యం కూడా ఎంతో అవసరమని అన్నారు. ముఖ్యంగా విధుల్లో ఎదురయ్యే క్లిష్ట పరిస్థితులు, అత్యవసర సమయాల్లో విధులను సమర్థవంతంగా నిర్వహించేందుకు మంచి ఆరోగ్యం, శారీరక దారుఢ్యం ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత, ఉత్సాహం పెరుగుతాయని కలెక్టర్ పేర్కొన్నారు. పునరుద్ధరించిన జిమ్‌ను పోలీస్ అధికారులు, సిబ్బంది సద్వినియోగం చేసుకుని వ్యాయామాన్ని రోజువారీ జీవితంలో ఒక భాగంగా చేసుకోవాలని సూచించారు. పోలీస్ సిబ్బంది సంక్షేమం కోసం మెరుగైన సౌకర్యాలు, జిమ్ మౌలిక వసతులు కల్పించేందుకు జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా మాట్లాడుతూ, జిల్లా పోలీస్ కార్యాలయానికి జిమ్ పరికరాలను మంజూరు చేయడంతో పాటు, డీపీఓ కార్యాలయానికి పెయింటింగ్, మరమ్మతులు చేపట్టి ఆధునికీకరించినందుకు జిల్లా కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.




## మిఠాయి తయారీపై ఎస్ఓటి దాడి..నిషేధిత ఫుడ్ కలర్స్ సీజ్

**ఘట్‌కేసర్, ఆగస్టు 14, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌లో అపరిశుభ్రమైన వాతావరణంలో మిఠాయిలు తయారు చేస్తున్న దుకాణంపై పోలీసులు దాడి చేసి నిషేధిత, గడువు తీరిన పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఓటి ఉప్పల్ జోన్ బృందం శుక్రవారం ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఘట్‌కేసర్ పట్టణం మెయిన్‌రోడ్డులో ఉన్న శ్రీబాలాజీ హుక్మీచంద్ మిఠాయి భండార్ తయారీ యూనిట్‌పై దాడి చేసింది. దుకాణం ఒక్క చోట నిర్వహిస్తుండగా తయారీ మరొక చోట చేసి స్వీట్ హౌస్‌లో పదార్థాలను విక్రయిస్తున్నారు. తయారీ కేంద్రంలో గడువు ముగిసిన ముడి పదార్థాలు, నిషేధిత సింథటిక్ ఫుడ్ కలర్స్‌ను ఉపయోగించి అపరిశుభ్రమైన పరిస్థితులలో ఆహార ఉత్పత్తులను తయారు చేస్తున్నారని గుర్తించిన పోలీసులు ఆహారంలో కల్తీ జరిగినట్లు నిర్ధారించారు. దుకాణం నిర్వహకుడు రాజారామ్ కచ్వా (48)ను అదుపులోకి తీసుకొని స్థానిక పోలీసులకు అప్పగించారు. అంబేద్కర్ చౌరస్తా సమీపంలోని ఎదులాబాద్ రోడ్డులోని తయారీ యూనిట్‌లో త్రిశూల్ సింథటిక్ ఫుడ్ కలర్స్ ఆరెంజ్ రెడ్ సూపర్ 2 బాక్సులు, త్రిశూల్ సింథటిక్ ఫుడ్ కలర్ లెమన్ ఎల్లో 3 బాక్సులు, త్రిశూల్ సింథటిక్ ఫుడ్ కలర్ బ్లూ స్టార్ 100 గ్రాముల 3 సీసాలు, నంది సింథటిక్ ఫుడ్ కలర్ (ఎరుపు పసుపు) 2 సీసాలు, బుష్ సింథటిక్ ఫుడ్ కలర్ 5 బాక్స్‌లు, శ్రీబ్రాండ్ సిట్రిక్ యాసిడ్ 500 గ్రాముల 2 ప్యాకెట్లు, తయారీకి సంబంధించిన స్వీట్లు, ముడి పదార్థాలు, గులాబ్ జామున్ స్వీట్, కలకనీ స్వీట్, బ్రౌన్ కలకండ్ స్వీట్, బాదం మిల్క్ స్వీట్స్, రసమలై స్వీట్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు ఎస్ఓటీ పోలీసులు సీజ్ చేసిన పదార్థాలను ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించగా దుకాణ యాజమానిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని ఇన్‌స్పెక్టర్ బాలస్వామి తెలిపారు.




## ఘనంగా స్వామి శేషవాహన, హనుమంతసేవ

**-రేపు గోదారంగనాయక కళ్యాణోత్సవం**

ఘట్‌కేసర్, ఆగస్టు 14, ప్రభాతవార్త: ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్‌లోని శ్రీగోదాసమేత మన్నారు రంగనాయక స్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శ్రావణమాసం ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని మామిడి తోరణాలు, వివిధ రకాలు పూలు, విద్యుత్ లైట్లతో అలంకరించారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం రంగనాయకస్వామి శేష వాహన సేవ, ఆండాళ్ తిరునక్షత్రం,హనుమంత వాహన సేవ ఘనంగా నిర్వహిచారు. మంగళవాయిద్యాలు, ధర్మకర్తలు, భక్తుల గోవిందనామస్మరణ మధ్య ఎదులాబాద్‌లోని పలు వీధులలో గోదాదేవి, రంగనాయకస్వామిల ఉత్సవ మూర్తులను ఊరేగించారు. శనివారం ఆలయంలో అశ్వ వాహనసేవ, గజవాహనసేవ, ఆదివారం ఉదయం 11 గంటలకు ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో గోదా, రంగమన్నారునాయకస్వామి కళ్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు తెలిపారు.

## ప్రతి పౌరుడు దేశాభివృద్ధికి పాటుపడాలి




**కీసర, ఆగస్టు 14, ప్రభాతవార్త :** ప్రతి పౌరుడు దేశాభివృద్ధికి పాటుపడాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు,బిజెపి ఇంఛార్జీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి,జిల్లా మాజీ అధ్యక్షులు పట్లోళ్ల విక్రంరెడ్డి అన్నారు.శుక్రవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీని నాగారం సెరినిటి పాఠశాల విద్యార్థులు రాంపల్లి చౌరస్తా వరకు పుర వీధులలో నిర్వహించారు.సుమారు 6 వందల మంది సెరినిటి పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల్లో దేశ భక్తి పెంపొందించడానికి,జాతీయ జెండాపై గౌరవాన్ని చాటడానికి భారత ప్రభుత్వం హర్ ఘర్ తిరంగా ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని తెలిపారు.ప్రతి పౌరుడు తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి,సెరినిటీ పాఠశాల కరస్పాడెంట్ నోముల జంగిరెడ్డి,మాజీ కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్ గౌడ్,నాయకులు సురేష్,రవీందర్‌రెడ్డి,సురేష్,రాహుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నిర్దవెల్లిలో మారుమోగిన హర్ ఘర్ తిరంగా యాత్ర

**కేశంపేట, ఆగస్టు 14, ప్రభాతవార్త :** కేశంపేట మండల పరిధిలోని నిర్దవెల్లి గ్రామంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వ ర్యంలో హర్ ఘర్ తిరంగా యాత్ర ఘనంగా నిర్వహించారు. గ్రామ బీజేపీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ యాత్రలో నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జాతీయ జెండాలను చేతబూని దేశభక్తి నినాదాలతో గ్రామంలో సందడి చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా షాద్‌నగర్ ధార్మిక సెల్ కన్వీనర్ పసుల నరసింహ యాదవ్, రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యులు, మండల హర్ ఘర్ తిరంగా కోకన్వీనర్ కంచుకోట మహేష్ పాల్గొన్నారుఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జాతీయ జెండా ప్రతి భారతీయుడి గర్వానికి ప్రతీక అని, దేశభక్తి ప్రతి ఒక్కరి హృదయంలో నిండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి కల్వకోలు తిరుపతి, నిర్దవెల్లి శక్తి కేంద్రం ఇంచార్జ్ ఆకుల గోపాల్, జిల్లా నాయకులు కరెడ్ల నరేందర్ రెడ్డి, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. భారత్ మాతాకీ జై, వందేమాతరం నినాదాలతో నిర్దవెల్లి గ్రామం మారుమోగింది.






## ఉత్సాహంగా ఎన్‌సిసి తిరంగా ర్యాలీ



**ఘట్‌కేసర్, ఆగస్టు 14, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌లో శుక్రవారం ఎన్‌సిసి క్యాడెట్లు ఉత్సాహంగా తిరంగా ర్యాలీ జరిపారు. హర్ ఘర్ తిరంగా స్ఫూర్తితో విద్యాకిరణ్ హైస్కూల్ ఎన్‌సిసి క్యాడెట్ల నినాదాలు చేస్తూ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమంలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు శివారెడ్డిగూడ విద్యాకిరణ్ హైస్కూల్ 2(టి) బ్యాటలియన్ ఎన్‌సిసి క్యాడెట్లతో సైకిల్ ర్యాలీ నిర్వహించారు.

## ఘనంగా పోచమ్మ ఆలయాల వార్షికోత్సవ వేడుకలు

**ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 14, ప్రభాత వార్త:** పోచారం డివిజన్ పరిధిలోని అన్నోజిగూడలో నల్ల పోచమ్మ, ఎర్రపోచమ్మ, మహాంకాళమ్మ, ఈదమ్మగ్రామ దేవతల ఆలయాల 4 వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఆయాగ్రామ దేవతలనాలుగవవార్షికోత్సవ వేడుకల సందర్భంగా అమ్మవార్లు శాకంబరీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.




